

ఎన్‌కౌంటర్‌లో స్వాధీనం చేసుకున్న తుపాకీని పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

సంభవ్.. కొనసాగింపు!

- 'ఆపరేషన్ సంభవ్' కొనసాగుతుందన్న డీజీపీ గుప్తా
- తూర్పు ఏజెన్సీలో వచ్చే ఏడాది మార్చి దాకా కూంబింగ్
- అడవుల్లో జల్లెడపడుతున్న కేంద్ర, రాష్ట్ర బలగాలు
- పర్యాటకరంగంపై కొంత ప్రభావం

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

మారేడుమిల్లి అంటే ఇప్పుడు చక్కటి పర్యాటక కేంద్రం. తెలుగురాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ఇక్కడి అడవుల్లో పర్యటించేందుకు నిరంతరం వస్తుంటారు. వాగులువంకలు, దట్టమైన అడవులతో పచ్చని లోకాన్ని ఈ ప్రాంతం తలపిస్తుంది. అయితే రెండు దశాబ్దాల కిందట నక్సల్స్‌బరి ఉద్యమంలో కీలక నేతలకు ఈ ఏజెన్సీ ఒక షెల్టర్. తాము మారేడుమిల్లి అడవుల్లోనే ఆయుధ సామగ్రిని తయారుచేసే వారమని ఉద్యమం నుంచి బయటకు వచ్చిన టెక్ మధు ఇటీవల ఓ డిబేట్‌లో చెప్పారు. అంటే ఇది నక్సల్ ఉద్యమంలోనే కాకుండా ఆయుధ సంపత్తిని తయారుచేసే కేంద్రంగానూ ఉండేదని తెలుస్తోంది. సాంకేతికపరమైన శిక్షణ కోసం తూర్పు ఏజెన్సీ ముఖ్య కేంద్రంగానూ ఎంచుకున్నట్టు మాజీ నక్సలైట్లు అందించే సమాచారం తేటతెల్లం చేస్తోంది. ఏజెన్సీలో ఇరవైయేళ్ల కిందట ఐఏఎస్‌ల కిడ్నాప్ తర్వాత భారీగా కూంబింగ్ జరగడంతో ఏజెన్సీ నుంచి నక్సలైట్లు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. కానీ ఈ ఏడాదిలో మళ్లీ ఇప్పటివరకు జరిగిన నాలుగు ఎన్‌కౌంటర్లు నాటి రోజులను తలపిస్తున్నాయి. ఇక అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఏడాది కాలంగా ముమ్మరంగా కూంబింగ్ జరుగుతోంది. తాజా ఘటనల నేపథ్యంలో చేపట్టిన కూంబింగ్ 'ఆపరేషన్ సంభవ్' మూడ్రోజుల తర్వాత ముగిసిందని ఎస్పీ అమిత్ బర్దర్ ప్రకటించారు. అయితే 'ఆపరేషన్ సంభవ్' 2026మార్చి వరకు కొనసాగుతుందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ప్రకటించారు. గురువారం ఆయన రంపచోడవరంలో మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో వినియోగించిన ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంలోనే కేంద్రం నిర్దేశించిన లక్ష్యం మేరకు రాష్ట్రంలో మావోయిస్టుల అలజడి లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టంచేశారు. దీంతో రంపచోడవరం ఏజెన్సీలో ఇకపై ముమ్మరంగా కూంబింగ్ జరుగునుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు రంపచోడవరం ఏజెన్సీలో ప్రశాంతమైన వాతావరణం ఉండి పర్యాటకులకు విడిదిగా విలసిల్లుతుండగా.. కొద్ది నెలలపాటు భద్రతా దళాల బూట్ల చప్పుళ్లు, నిఘా వర్గాల కదలికలు, పోలీసు ఉన్నతాధికారుల పర్యటనలతో కొంత ఆందోళనకర పరిస్థితులు నెలకొనే అవకాశం కనిపిస్తోంది. అదేవిధంగా ఏజెన్సీతోపాటు సమీపంలోని మైదాన ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్న మావోయిస్టుల గాలింపు చర్యలు సైతం ముమ్మరంగా సాగాలని డీజీపీ ఆదేశాలివ్వడంతో ఆమేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ విస్తృత తనిఖీలకు దిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకుల తాకిడిపై కొంత ప్రభావం చూపనుంది. కొంత కాలం ఈ ప్రభావం ఉండే అవకాశం ఉంది.



నాడు గాలికి.. నేడు దారికి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మంచిరోజులు వచ్చాయి. అప్పట్లో వీటికి కేంద్రం ఇచ్చిన నిధులను దారిమళ్లించి భవనాల నిర్మాణాన్ని గాలికి వదిలేయడంతో అవన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అయితే ఇప్పుడు ప్రభుత్వం వీటికి శాశ్వత భవనాలు నిర్మించడానికి ముందుకు వచ్చింది. అసంపూర్తిగా వదిలేసిన వాటిని, అసలు భవనాలే లేని క్లినిక్‌లకు శాశ్వత భవనాలు సమకూర్చాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 39 క్లినిక్‌లకు శాశ్వత భవనాలకు రూ.11.50 కోట్ల నిధులు కేటాయించింది. మరో వారంలో కోనసీమలో 56 భవనాలకు రూ.23 కోట్లు కేటాయించబోతోంది. ఇక తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు రూ.12 కోట్లతో మరిన్ని భవనాల నిర్మాణం చేపట్టడానికి సన్నద్ధం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో వీటి నిర్మాణం ద్వారా పేదలకు ఇంటికి సమీపంలోనే వైద్య సేవలు అందేలా చేయడానికి కేంద్రం వీటిని ప్రవేశపెట్టింది. మరోవైపు విలేజ్ క్లినిక్‌ల ద్వారా సమర్థవంతంగా వైద్య సేవలు అందించేలా రాష్ట్రప్రభుత్వం నడుం బిగించింది.

- ఉమ్మడి జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మంచి రోజులు
- వీటికి శాశ్వత భవనాలు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- కాకినాడ, కోనసీమల్లో 39 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ.11.50 కోట్లతో టెండర్లు
- మరో వారంలో కోనసీమలో రూ.23 కోట్లతో 56 క్లినిక్‌లకు టెండర్ల జారీ
- తూర్పు, కాకినాడ జిల్లాల్లో మరో రూ.12 కోట్లతో భవనాల నిర్మాణానికీ సన్నద్ధం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ప్రారంభించింది. వీటిలో పేదలకు 14 రకాల వైద్య సేవలు అందుతాయని ప్రకటించింది. అందులోభాగంగా ఉమ్మడి జిల్లాలో 1,050కిపైగా వీటిని మంజూరు చేసింది. ఇందులో కాకినాడ జిల్లాలో 410, తూర్పుగోదావరి జిల్లాలో 368 వరకు ఉన్నాయి. అయితే వీటిలో సగం క్లినిక్‌లకు శాశ్వత భవనాలే లేవు. చాలావరకు సచివాలయాలు, పంచాయతీల్లో నిర్వహించి అప్పటి వైసీపీ ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. నిజానికి వీటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. చివరకు వీటిని కూడా అప్పటి జగన్ సర్కారు నిధులు దారి మళ్లించేసింది. దీంతో అనేక క్లినిక్‌లకు ఇప్పటికీ శాశ్వత భవనాలు లేవు. ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా క్లినిక్‌లకు అసలు ఇప్పటికీ సొంత భవనాలు లేక అద్దె, లేదా వేరే పంచన నడుస్తున్నాయి. దీంతో సేవలు కూడా గ్రామీణ ప్రజలకు సరిగ్గా అందని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది. వీటికి శాశ్వత భవనాలు సమకూర్చాలని నిర్ణయించింది. అందులో భాగంగా కేంద్రంతో మాట్లాడి నిధులు రప్పించింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి కేంద్రం 80 శాతం వరకు నిధులు సమకూర్చుతోంది. వీటిని 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్' పేరు నామకరణం చేసింది. ఇందులోభాగంగా అసంపూర్తిగా ఉన్నవి, అద్దె భవనాల్లో ఉన్న వాటికి శాశ్వత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో తాజాగా 39 హెల్త్‌క్లినిక్‌లకు శాశ్వత భవనాలు మంజూరు చేస్తూ రూ.11.50 కోట్లు విడుదల చేసింది. తుని మండలం ఎస్.అన్నవరం4 క్లినిక్‌కు రూ.28.98 లక్షలు, ఎస్.అన్నవరం-1కు రూ.29.09 లక్షలు, పిఠాపురం మండలంలో నరసింగపురం క్లినిక్‌కు రూ.29.37లక్షలు, గొల్లప్రోలు మండలం మల్లవరం రూ.29.36 లక్షలు, తాటిపర్తి రూ.29.12, తాటిపర్తి-2 రూ.29.13 లక్షలు, పెదపూడి మండలం గండ్రేడు రూ.27.87, రాజుపాలెం రూ.27.75, ఏపీత్రయం రూ.29.69, దోమాడ రూ.27.06, కాజులూరు మండలం కోలంక-2 రూ.29.34 లక్షలు, ఉప్పుమిల్లి రూ.29.59, పల్లిపాలెం2 రూ.29.19, ప్రత్తిపాడు మండలం శంకర్లపూడి రూ.29.03 లక్షలు, ఏలేశ్వరం మండలం ఎర్రవరం-1 రూ.28.83, లంపకలోవ రూ.29.03, సామర్లకోట మండలం వేట్లపాలెం-1 రూ.29.05, మాధవపట్నం రూ.29.24, పెద్దాపురం మండలం కాండ్రకోట రూ.28.68లక్షలు, మర్లోవ రూ.28.85, కరప మండలం పెనుగుదురు రూ.29.51 లక్షలు, కరప రూ.29.36, రౌతులపూడి గుమ్మరేగుల రూ.29.31, కాకినాడ-1 రూ.29.58లక్షలు, రమణయ్యపేట రూ.29.57, వలసపాకల రూ.29.54, సూర్యారావు పేట రూ.29.41, కొవ్వూరు రూ.29.65, తూరంగి 29.58, తూరంగి-22 రూ.29.58, తూరంగి-4 రూ.29.58లక్షలు, యు.కొత్తపల్లి రూ.29.38, పొన్నాడ రూ.29.38 లక్షలు మంజూరు చేసింది. కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పోతవరం క్లినిక్‌కు రూ.29.21లక్షలు, రామచంద్రపురం మండలం ఉండూరుకు రూ.29.58, వెలంపాలెం రూ.29.63. కె.గంగవరం-2 రూ.29.22, కె.గంగవరం మండలం దంగేరు క్లినిక్‌కు రూ.29.24, ముమ్మిడివరం మండలం కొత్తలంకకు రూ.28.81లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ క్లినిక్‌లను ఏడాదిలోగా పూర్తి చేసేలా తాజాగా ప్రభుత్వం టెండర్లు జారీచేసింది. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో వీటి నిర్మాణం పూర్తికానుండగా, ఈనెల 26లోగా వీటికి టెండర్లు దాఖలు చేయాలని ప్రభుత్వం కాంట్రాక్టర్లను కోరింది.

త్వరలో మరిన్ని..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న వెయ్యికిపైగా ఉన్న హెల్త్ క్లినిక్‌ల్లో 30శాతం పునాదులు, శ్లాబ్ సాయిలో మూడేళ్ల నుంచీ అప్పటి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో నిలిచిపోయాయి. వీటిని కూడా ఇప్పుడు ప్రభుత్వం పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అటు శాశ్వత భవనాల నిర్మాణంపైనా దృష్టిసారించింది. మరో వారంలో కోనసీమ జిల్లాలో రూ.23 కోట్లతో 56 హెల్త్ క్లినిక్‌లకు శాశ్వత భవనాలు నిర్మించేలా ప్రభుత్వం టెండర్లు పిలవబోతోంది. అలాగే తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో రూ.12 కోట్లతో మరికొన్ని భవనాల నిర్మాణం చేపట్టనుంది. సగంలో నిలిచిపోయిన క్లినిక్‌లు ఉమ్మడి జిల్లాలో 250కిపైగా పూర్తి చేయడానికి అనుమతులు జారీ చేయనుంది. చాలాభవనాలకు స్థలాలు కూడా లేకపోవడంతో వీటిని కూడా కొన్ని నెలల కిందట ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. వీటికి కూడా త్వరలో టెండర్లు పిలవనున్నారు. మరోపక్క ఈ క్లినిక్‌ల్లో ఉండాల్సిన సిబ్బంది కూడా గత ప్రభుత్వంలో చాలాచోట్ల లేరు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు సరైన వైద్య సదుపాయాలు అందేలా ఏఎన్ఎం, ఆశావర్కర్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచి.. వీరంతా ఆయా గ్రామాల్లోని క్లినిక్‌ల్లో ఓపీ సేవలు అందించనున్నారు.



జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్

'రబీ'లో చిట్టచివరి భూములకు సాగునీరందేలా ప్రణాళిక

- మూడు డెల్టాల పరిధిలో జిల్లాలో 8.96లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం
- వారాబంధీ విధానంలో పూర్తిస్థాయిలో సాగునీరు
- వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకు సరఫరాకు నిర్ణయం
- జిల్లా ఇరిగేషన్ సలహా బోర్డు సమావేశంలో కలెక్టర్

అమలాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రానున్న రబీ సీజన్‌లో సాగునీటి సరఫరా విషయంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమర్థవంతంగా సాగునీటి పంపిణీ విధానం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో కోనసీమ జిల్లాలో 2025-26 రబీ సాగునీరు సరఫరాకు సంబంధించి గురువారం నిర్వహించిన ఇరిగేషన్ సలహాబోర్డు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల సభ్యులు పాల్గొన్నారు. రానున్న రబీ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు సంబంధించి 8.96లక్షల ఎకరాల్లో సాగుకుగాను 93.22 టీఎంసీల నీటి లభ్యత అవసరమని కలెక్టర్ అన్నారు. ఈ స్థాయిలో రబీకి సాగునీటి సరఫరాకు సంబంధించి కార్యాచరణను సిద్ధం చేసినట్టు తెలిపారు. గోదావరి నదీ ప్రవాహం ద్వారా 9 టీఎంసీలు, సీలేరు నుంచి 44 టీఎంసీలు, పోలవరం నుంచి 20 టీఎంసీలు, సీలేరు బైపాస్ అనుమతితో 20 టీఎంసీలు వెరసి 93 టీఎంసీలను సేకరించినట్టు వెల్లడించారు. నీటి పంపిణీ విధివిధానాలపై సభ్యులతో సమీక్షించారు. రబీలో సాగునీటిని ఆదా చేయవచ్చని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. క్లోజర్‌లో కాల్వలు, డ్రెయిన్లు చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. రబీలో చిట్టచివరి భూముల వరకు నీటి సరఫరా ఇబ్బంది లేకుండా ప్రాధాన్యమివ్వాలని, వారాబంధీ విధానాన్ని అమలు చేయాలని, ప్రజాప్రతినిధులు సూచించిన విధంగా కాల్వల్లో జంగిల్ క్లియరెన్సు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం 400 పనులకు రూ.53 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో లష్కర్ల నియామకంపై చర్చించారు. ఎక్కడా నీటిఎద్దడి లేకుండా వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకు రబీ సాగుకు నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జూన్ 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందన్నారు.

సాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోండి: ప్రజాప్రతినిధులు

సమీక్షలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ గోదావరి, సీలేరు డెడ్ స్టోరేజ్ వాటర్ స్థాయిలను పునఃపరిశీలించాలని కోరారు. లేనిపక్షంలో సాగునీటి ఎద్దడి సమస్యలు పునరావృతమవుతాయన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ క్లోజర్ పనులు నిర్ణీత కాలవ్యవధిలో చేపట్టి రైతుల ఉపయోగాలను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ కోనసీమ జిల్లా ఆటుపోట్లుకు సంబంధించి ప్రాంతాలవారీగా పంటలు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత బోర్డు సభ్యులపై ఉందన్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ఇరిగేషన్‌శాఖ అధికారులు సమర్థవంతంగా పనిచేసి రైతులకు మేలు చేకూర్చాలన్నారు. ఖరీఫ్ పంట మునిగిపోకుండా రబీ సీజన్ పంటలు ఎండిపోకుండా ఉండేందుకు డెల్టా ఆధునీకరణ పనులు చేపట్టాల్సిన ఆవశ్యకతను సూచించారు. తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన 9లాకులను ఆధునికీకరించి లష్కర్లను, సిబ్బంది కోటర్లలో కనీస వసతులు కల్పించాలన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ లష్కర్ల వేతనాలు పెంపుతోపాటు సక్రమంగా ప్రతినెలా అందించాలని కోరారు. సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ సాగునీటి అందుబాటును దృష్టిలో ఉంచుకుని క్రాస్‌బండ్ల ద్వారా నీటిని అందించడానికి చర్యలు చేపట్టాలన్నారు. టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ రబీలో సాగునీటి నిల్వలు, నీటి వసతులను సమగ్రంగా పర్యవేక్షిస్తూ నీటి పంపిణీ ఆయకట్టు అంతటికీ సమగ్రంగా అందించాలని కోరారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, డీఆర్వో కె.మాధవి, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, జలవనరులశాఖ పర్యవేక్షక ఇంజనీర్ గోపీనాథ్‌తోపాటు సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జిల్లాలో మావోయిస్టుల ప్రభావం లేదు



మండపేట రూరల్ సీఐ కార్యాలయంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

మండపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో మావోయిస్టుల ప్రభావం ఏమీ లేదని, వారి గురించి ప్రజలు ఆందోళన చెందనవరం లేదని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. మండపేట రూరల్ సీఐ కార్యాలయాన్ని గురువారం రాత్రి ఆయన పరిశీలించారు. ఏడాది ముగింపులో ప్రమాదాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఇటీవల కిడ్నాప్‌లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో విద్యార్థినులకు గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. సోషల్‌మీడియా ప్రభావం గురించి విద్యార్థులకు వివరిస్తామని, జిల్లాలో రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టిసారిస్తామని చెప్పారు. జిల్లాలో రావులపాలెంలో మావోయిస్టు పట్టుపడ్డ విషయమై ఐజీని ప్రశ్నించగా ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఒక మావోయిస్టును పట్టుకున్నామన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండపేట రూరల్ సీఐ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు మెయింటెనెన్స్ సక్రమంగా ఉందన్నారు. ఎస్పీ రాహుల్‌మీనా, రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ దొర్రాజు, డి.సురేష్ ఉన్నారు.

నిబంధనలు పాటించని స్కూల్ బస్సు సీజ్

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు20 (ఆంధ్రజ్యోతి): మోటారువాహనాల చట్ట నిబంధనలు మేరకు ప్రతి బడి బస్సు ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రామచంద్రపురం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న సన్‌షైన్ పాఠశాల బస్సును ఆయన సీజ్ చేశారు. ప్రతి బడి బస్సుకు విధిగా ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్సు, పొల్యూషన్, డ్రైవర్‌కు వాలీడ్ లైసెన్సు ఉండాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించాలని, వేగం నియంత్రణ పాటిస్తూ విద్యార్థులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని అన్నారు. ప్రతి బడిబస్సు రోడ్డు ట్యాక్స్ చెల్లించి అన్ని పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో విశ్రాంత ఎంఈవో

- మూడు దఫాలుగా రూ.34.6 లక్షల పెన్షన్ సొమ్ము పంపిన వైనం
- ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

మెయిన్‌లో..

ఎస్సీ, బీసీ హాస్టళ్లకు కిట్లు పంపిణీ

అమలాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, బీసీ ఆశ్రమ పాఠశాలల్లోని 8 నుంచి 10 తరగతుల విద్యార్థుల వసతి ఉజ్వల భవిష్యత్తుకు వసతిగృహ సంక్షేమ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవచూపాలని జేసీ టి.నిషాంతి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మానవతా దృక్పథంతో అందించిన బకెట్లు, దుప్పట్లను 33 సాంఘిక సంక్షేమ, 21 బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆమె పంపిణీచేశారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ అవసరమైన విద్యావసతి, ఆరోగ్యం, భోజనం, సురక్షిత వాతావరణం వంటి అంశాల్లో చురుకైన చర్యలు తీసుకోవాలన్నారు. వెనుకబడిన గ్రేడ్‌ల్లో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రథమ శ్రేణుల్లో ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్వో కె.మాధవి, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, వార్డెన్లు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సమకూర్చిన కిట్లను పంపిణీచేస్తున్న జేసీ, డీఆర్వో

బాణసంచా తయారీదారులతో డీఆర్వో సమీక్ష

జిల్లాలో 19 బాణసంచా తయారీ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటిస్తేనే మళ్లీ వాటిని పునరుద్ధరించేందుకు అవకాశంఉందని డీఆర్వో మాధవి గురువారం స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బాణసంచా తయారీదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. అక్టోబరు 8న రాయవరం మండలంలో భారీబాణసంచా పేలుడు ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేసి సంఘటనపై విచారణ చేపట్టిందని, దీనికి అనుబంధంగా మార్గదర్శకాలు రూపొందించి సమర్పించిందని ఆమె తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలతో తయారీకి దుకాణాలు పునరుద్ధరించేందుకు ఆస్కారం ఉందని ఆమె స్పష్టం చేశారు. మార్గదర్శకాలను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, అగ్నిమాపక అధికారి పార్థసారథి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

దిండిలో సీప్లేన్ పర్యాటకానికి ప్రతిపాదనలు

- రూ.20 కోట్లతో ప్రాజెక్టు ఏర్పాటుకు నిర్ణయం
- కలెక్టర్‌కు ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధుల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధితో కలెక్టర్, జేసీ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఒకవైపు సముద్రతీరం.. మూడు వైపులా గోదావరి నదీపాయల నడుమ ప్రకృతి అందాలకు ఆలవాలమైన కోనసీమ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలోభాగంగా వశిష్ఠ నదిలో 'స్లీ ప్లేన్' పర్యాటకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలోని వశిష్ఠ నది మలికిపురం మండలం దిండి రిసార్ట్స్ వద్ద సీప్లేన్ ప్రాజెక్టు ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం రూ.20కోట్ల అంచనా వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒకవైపు దిండి రిసార్ట్స్‌నుంచి గోదావరిలో హౌస్ బోట్ విహారం ఇప్పటికే ఉభయ రాష్ట్రాల్లోను ప్రత్యేకత సంతరించుకుంది. ఇప్పుడు వశిష్ఠ నదిలో స్లీ ప్లేన్ ఏర్పాటుకు ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ లిమిటెడ్‌సంస్థ రూ.20కోట్లతో దిండి సమీపంలో నీటిలో సీప్లేన్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు సమాచారం. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ తొమ్మిది ప్రాంతాల్లో నీటిపై ల్యాండింగ్ అయి పయనించే విమాన సర్వీసు ప్రాజెక్టులను చేపట్టేందుకు నిర్ణయించింది. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ఎఫ్ఎస్‌హెచ్ఎంఎంటీ ప్రాజెక్టు అసోసియేట్ తన్సీతో కలెక్టర్ అమలాపురంలోని కలెక్టరేట్‌లో గురువారం సమావేశమయ్యారు. ఆయనకు వారు సుదీర్ఘంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 9ప్రాజెక్టుల్లో ఒక్కోదాన్ని రూ.20కోట్లతో సంస్థ చేపట్టింది. వీటిలో ఒక ప్రాజెక్టు వశిష్ఠ నది తీరాన దిండి ప్రాంతంలో ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి జీపీఎస్ కోఆర్డినేటర్స్, ఇతర సాంకేతిక అంశాల ఆధారంగా భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. దిండి సమీపంలో మూడు ప్రాంతాలను గుర్తించారు. వాటిలో ఒకప్రాంతాన్ని ఎంపిక చేసి ప్రాజెక్టు ఏర్పాటుకు నివేదికను రూపొందించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ టి.నిషాంతి, డీఆర్వో మాధవి ప్రాజెక్టు ఏర్పాటు ప్రతిపాదనపై సమీక్ష చేశారు.

సీఆర్ఎంపీలను జిల్లాలోనే కొనసాగించాలని జేసీకి వినతి

అమలాపురంటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సమగ్రశిక్షలో పనిచేస్తున్న 29 మంది సీఆర్ఎంపీలను ఇతర జిల్లాలకు బదిలీలు చేయడం తగదని కోరుతూ గురువారం జేసీ టి.నిషాంతితోపాటు జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవిలకు వినతిపత్రాలు అందజేశారు. 13ఏళ్లుగా స్కూలు కాంప్లెక్సుల్లో పనిచేస్తూ నామమాత్రపు జీతాలతో నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీఆర్ఎంపీలను కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు బదిలీలు చేస్తున్నారన్న సమాచారంతో తాము తీవ్ర ఆందోళనకు గురైనట్టు వివరించారు. ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిలా ప్రధానకార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు తదితర ప్రముఖులతో కలిసి తమ గోడును వివరించారు. నామమాత్రపు జీతాలతో పిల్లలతో ఇతర జిల్లాలకు వెళ్లి ఎలా పనిచేయాలని తెలిపారు. కోనసీమ జిల్లాలోనే తమను కొనసాగించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సీఆర్పీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నామాడి వెంకట్రావు, కార్యదర్శి పి.రవికుమార్, గౌరవాధ్యక్షుడు మెండు శ్రీనుబాబు, మహిళా కార్యదర్శి ఎం.అనూష, చంద్రరావు, కేవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపునకు షెడ్యూల్

అమలాపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చేఏడాది మార్చిలో జరిగే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజుల చెల్లింపునకు షెడ్యూల్ విడుదలైనట్టు డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా గురువారం తెలిపారు. పరీక్ష ఫీజు కింద రూ.125 చెల్లించాలన్నారు. ఆలస్య రుసుం లేకుండా ఈనెల 25 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చునన్నారు. ఎస్ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ, వృత్తిపరమైన పరీక్షలకు సంబంధించి ఫీజుల వివరాలను ఆయన వివరించారు. రూ.50 ఆలస్య రుసుంతో నవంబరు 26నుంచి డిసెంబరు 3వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.200 ఆలస్య రుసుంతో డిసెంబరు 4 నుంచి 10వరకు,రూ.500 ఆలస్య రుసుంతో డిసెంబరు 11నుంచి 15 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ టెన్త్ విద్యార్థులకు అన్నిసబ్జెక్టులకు రూ.125 ఫీజుగా నిర్ణయించారు. మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువైతే రూ.125 పరీక్ష ఫీజుగా నిర్ణయించారు. వృత్తిపరమైన విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందని, వయో పరిమితి సడలింపు రుసుం రూ.300గా ఉంటుందని అన్నారు. పరీక్ష ఫీజును పాఠశాలల స్కూల్ లాగిన్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని, టీఎఫ్ఎంఎస్, బ్యాంకు చలానాల ద్వారా చెల్లింపులు అంగీకరించరని స్పష్టం చేశారు.



ములగపూడి కొండపై పురాతన కోదండ రామాలయం

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ములగపూడిలో ఎత్తయిన కొండపై కోదండరాముని పురాతన ఆలయం ఉంది. దీనిని 13-14 శతాబ్దాల మధ్య నిర్మించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పట్లో ఇక్కడ శ్రీరామనవమిని అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. ఈ ఆలయాన్ని చాలా కాలంగా పట్టించుకోలేదు. గ్రామానికి చెందిన కొందరు కమిటీగా ఏర్పడి కొంచెంకొంచెంగా అభివృద్ధి చేస్తున్నారు.

ప్రతిఏటా శ్రీరామనవమితో పాటు కార్తీక పౌర్ణమి నాడు తెప్పోత్సవం, వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి రోజున గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. భక్తులు వేలాదిగా హాజరవుతున్నారు.

మరో భద్రాద్రి

- ములగపూడిలో కొండపై 14వ శతాబ్దం నాటి కోదండ రామాలయం
- చరిత్ర ఘనం... ఆదరణ శూన్యం
- గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి
- ప్రతిఏటా కార్తీక పౌర్ణమినాడు తెప్పోత్సవం, వైకుంఠ ఏకాదశినాడు గిరి ప్రదక్షిణ

(రౌతులపూడి-ఆంధ్రజ్యోతి)

14వ శతాబ్దంలో రాఘవపట్నాన్ని పరిపాలించిన రాఘవరాజు ములగపూడిలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు ఆలయ శాసనాలు తెలుపుతున్నాయి. భద్రాద్రిలో ఉన్నట్టుగానే ఇక్కడ కూడా ఏకశిలపై సీతారాములు ఉండడంతో మరో భద్రాదిగా పేరొందింది. ఆలయం కింద రాతి కట్టడం ఆధారంగా 13-14 శతాబ్దాల మధ్య ఆలయ నిర్మాణం జరిగినట్టు గుర్తించారు. ఉపయోగించిన ఇటుకలు, రాతితో నిర్మించిన ద్వారం, విగ్రహం పురాతన ప్రాశస్త్యాన్ని, గొప్పదనాన్ని చాటి చెప్తున్నాయి. రాతితో చేసిన నీటి తొట్టెలు, హోమ గుండాలు మొదలైన వాటి ఆనవాళ్లు ఇక్కడ ఉన్నాయి. ఆలయ సమీపంలోని వేగులమ్మ వారి పీఠంలో ఉంచిన చిహ్నాలను చోళుల కాలం నాటివిగా చెప్తున్నారు. రాఘవరాజు నిర్మించిన 162 ఎకరాల చెరువు ద్వారా వేలాది వ్యవసాయ భూములకు సాగునీరు అందుతోంది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ దేవాలయాన్ని సందర్శించినట్టు పూర్వీకులు చెప్పేవారు. మహ్మదీయుల దండయాత్రలో ఈ ఆలయం శిథిలమైనట్టు ఓ కథనం ప్రాచుర్యంలో ఉంది.



సీతారాముల ఏకశిలా విగ్రహం



రాతి కట్టడంతో నిర్మించిన ఆలయ గోపురం లోపలి భాగం



వైకుంఠ ఏకాదశినాడు గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు (పాత చిత్రం)

అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలి

ఆలయ కమిటీ విన్నపం

మేమంతా కష్టపడి మెట్ల మార్గం, రహదారి నిర్మించుకున్నాము. రామయ్యకు పూజలు చేసుకుంటున్నాము. ఆలయం కూలిపోయే స్థితిలో ఉంది. ఆలయ పునర్నిర్మాణానికి గతంలో దేవదాయ శాఖ రూ.75లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులు రావాలంటే సొంతంగా రూ.18లక్షలు కాంట్రిబ్యూషన్ చెల్లించాలి. అంత మొత్తం కట్టే స్థితిలో లేము. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి ఆలయ అభివృద్ధికి సహకరించాలి.



16X24 సైజులో లభ్యమైన ఇటుక



కొండపై కనిపిస్తున్న అలనాటి నీటి కుండీ



తేగలు... ఆరోగ్య దీపికలు

- ధర తక్కువ... ఔషధ గుణాలు ఎక్కువ
- ఈ ఏడాది ముందుగానే మార్కెట్‌లోకి

(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)



పూర్వీకులకే కాదు ఆధునికులకూ ఆరోగ్య ప్రదాయిని. శీతాకాలంలో ప్రజలు తినే శాఖాహారమిది. తాటి చెట్లు కనుమరుగవుతున్నప్పటికీ డిసెంబరు, జనవరి నెలల్లో విస్తారంగా దొరుకుతుంది. అదే 'తేగ. తాటి మొలకేనన్న విషయం చాలా మందికి తెలియదు. సంక్రాంతి పండుగ రోజుల్లో గ్రామాల్లో దర్శనమిచ్చే తేగలు ఈ ఏడాది నవంబరు ప్రారంభం నుంచే మార్కెట్లో కనిపిస్తున్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులతో తాటిపండ్లను ముందుగా నాటడంతో పక్వానికి వచ్చి నవంబరు మొదటి వారానికే తేగలు అందుబాటులోకి వచ్చాయని గ్రామీణ ప్రాంతాల ప్రజలు చెప్తున్నారు.

నగరాలకు ఎగుమతి: ఒకప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తేగలకు చాగల్నాడు ప్రసిద్ధి. దీంతో చాగల్నాడు ప్రాంతాలను ఈ సీజన్లో తేగల్నాడు అని కూడా ముద్దుగా పిలుచుకునేవారు. పెద్దాపురం, రంగంపేట, జగ్గంపేట, రాజానగరం, కిర్లంపూడి, సీతానగరం, కోరుకొండ ప్రాంతాలకు చెందిన వారు తేగలను తీసుకెళ్లి జాతీయ రహదారిపై వెళ్లే లారీల్లోను, విశాఖ, విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లలోను విక్రయిస్తారు. బస్టాండ్లలోనూ విక్రయిస్తూ ఈ సీజన్లో ఎందరో జీవనోపాధి పొందుతారు. నాలుగు తేగలు కేవలం రూ.20 మాత్రమే. తేగల ప్రయోజనాలను గుర్తించిన మన పూర్వీకులు వాటి ఉత్పత్తికి పొలాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు.

అన్ని వయసుల వారిలో రోగ నిరోధక శక్తిని పెంచే లక్షణాలు తేగల్లో ఉన్నాయని పోషకాహార నిపుణులు చెప్తున్నారు. తేగలలో బి1, బి2, బి3, సి విటమిన్లు, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఒమెగా, ఫ్యాటీ యాసిడ్లు సమృద్ధిగా ఉంటాయి. తేగలు తిన్న వెంటనే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగుల్లో చేరిన మలినాలు తొలగిపోతాయి. ఎముకలు, దంతాలు దృఢపడతాయని గ్రామీణుల విశ్వాసం. చలికాలంలో తేగలు తింటే రక్తహీనత సమస్య పరిష్కారమవుతుంది. తెల్ల రక్త కణాలు వృద్ధి చెందుతాయి. తేగలు తింటే మెదడు కూడా చురుకుగా పనిచేస్తుంది. ఎన్నో ప్రయోజనాలున్న తేగలను పెద్దాపురం, రంగంపేట ప్రాంతాల నుంచి పలువురు తీసుకొచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇంకెందుకు ఆలస్యం. తక్కువ ధరకు లభించే తేగలను మీరు కూడా ఈ సీజన్లో తినండి మరి.

ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో రాజశేఖర్‌కు స్వర్ణపతకం



దేవరపల్లిలో రాజశేఖర్‌ను సత్కరిస్తున్న జేఏసీ కమిటీ సభ్యులు, తదితరులు

దేవరపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం గౌరీపట్నంకు చెందిన గెల్లా రాజశేఖర్ ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో పాల్గొని స్వర్ణపతకం సాధించినట్టు గురువారం ఆయన విలేఖరులకు తెలిపారు. ఈ సందరంగా దేవరపల్లిలో మాట్లాడుతూ భూటాన్ దేశం థింపూలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగిన ఎస్‌బీకేఎఫ్ 12వ ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. ఇంకా మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించటమే తన కోరికన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరిగిన చదరంగ పోటీల్లో తాను పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించానని తెలిపారు. కాగా, ఇటీవల గోవాలో జరిగిన చెస్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించానని, నెల్లూరులో జరిగిన పోటీల్లో వివిధ బహుమతులు సాధించినట్టు తెలిపారు. తాను చదరంగం పోటీల్లో ఎంతో శిక్షణ పొంది దీన్ని సాధించినట్టు తెలిపారు. భారత్ తరఫున అంతర్జాతీయ స్థాయిలో చెస్ పోటీల్లో పాల్గొని గౌరవం తీసుకురావాలనే తపన తనలో ఉందన్నారు. ప్రస్తుతం తాను రాజమండ్రిలోని గోల్డ్‌జిమ్‌లో ప్రథమ కోచ్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. ఈ మేరకు రాజశేఖర్‌ను గురువారం దేవరపల్లిలో జేఏసీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు దున్న సుమన్ బాబు, పచ్చా రామ్‌గోపాల్, మడతల శంకరం, ముప్పిడి భాస్కర్‌కుమార్, పల్లికొండ సురేశ్‌కుమార్, రాపాక అబ్బులు, మల్లిపూడి శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి మాతకు పంచహారతి



వృద్ధగౌతమికి కుండలేశ్వరంలో గంగాహారతి ఇస్తున్న దృశ్యం



కాట్రేనికోన, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కుండలేశ్వరం వద్ద గోదావరిమాతకు గురువారం రాత్రి వైభవంగా పంచహారతి నిర్వహించారు. సాయంత్రం శ్రీపార్వతీకుండలేశ్వరస్వామి, శ్రీరుక్మిణీసత్యభామసమేత వేణుగోపాలస్వామి, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ, ఆంజనేయస్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆచార్యత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో పంచహారతి పుడకలతో మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా వృద్ధగౌతమీ నదీ తీరానికి వెళ్లారు. తర్వాత సంప్రదాయబద్ధంగా పంచహారతి నిర్వహించారు. నక్షత్ర, కుంభ , నాగ, బిల్వ, పంచహారతి నిర్వహించారు. గంగుమళ్ల నిరంజనరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రాజశేఖర్‌తో పాటు పలువురికి సన్మానాలు చేశారు. కార్యక్రమంలో దాట్ల పవన్, త్సవటపల్లి నాగేంద్ర, త్సవటపల్లి శ్రీను, పీఎస్ఎన్ రాజు, నడింపల్లి సుబ్బరాజు, చెల్లి సురేష్, ఆకాశం శ్రీను, గంగుమళ్ల రవి శంకరకుమార్, గోకరకొండ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల నేరాలపై నియంత్రణకు చర్యలు

- ఐజీ అశోక్‌కుమార్
- ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



ద్రాక్షారామ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా

ద్రాక్షారామ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ మధ్యకాలంలో చిన్నపిల్లలపై జరిగిన నేరాలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టామని ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. తర్వాత స్థానిక విలేకరులతో మాట్లాడారు. చిన్నపిల్లలపై జరిగిన నేరాలలో కేసులను త్వరగా విచారణ జరుపుతామన్నారు. చార్జీషీట్ కూడా దాఖలు చేసి ట్రయల్ అనుసరిస్తూ ముద్దాయిలకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ముఖ్యం గా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల వల్ల కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. శక్తి అలాగే గ్రామ మహిళా కార్యదర్శులతో కలసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో మహిళా టీచర్లకు శిక్షణ ఇవ్వాలని ఎస్పీలకు సూచించడం జరిగిందన్నారు. ఈయనతో ఎస్పీ రాహుల్‌మీనా, డీఎస్పీ ఎస్.రఘువీర్, సీఐ ఎంవీ నారాయణ, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పూజలు

అంతకుముందు ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని డీఐజీ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

డీఎస్పీ కార్యాలయం తనిఖీ

రామచంద్రపురం డీఎస్పీ కార్యాలయంలో నమోదైన కేసుల ఫైళ్లను పరిశీలించారు. దీనిలో భాగంగా పెండింగ్ కేసులు స్థితిగతులు, దర్యాప్తు పురోగతి గురించి ఆరా తీశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థులు



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన రౌతులపూడి హైస్కూల్ విద్యార్థులు



రంగంపేటలో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రౌతులపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రౌతులపూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో రౌతులపూడి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న పైల శ్రీనివాస్ షార్ట్‌పుట్, డిస్కస్ త్రో, గాడి రమణమ్మ డిస్కస్‌త్రో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, చైర్మన్ షేక్ సలీం, ఎంఈవోలు సతీష్‌బాబు, కొండబాబు, వ్యాయామోపాధ్యాయులు సుర్ల కృష్ణవేణి, అడిగర్ల మమత, తదితరులు అభినందించారు.

రంగంపేట: రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి గురువారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భాగంగా ఈనెల 18న కాకినాడలో జిల్లా స్థాయి (ఉమ్మడి జిల్లా) జరిగిన 100 మీటర్ల రన్నింగ్, ట్రిపుల్ జంప్‌లో యవ్వన లక్ష్మి, ట్రిపుల్ జంప్‌లో జాహ్నవి, 110 మీటర్ల హర్డిల్స్‌లో జాహ్నవి, సాయివీరలక్ష్మి, పోల్‌వాల్ట్‌లో ప్రసన్న, స్వర్ణ, సత్యనారాయణ ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరు ఈ నెల 23, 24 తేదీల్లో గుంటూరు జిల్లా వినుకొండ జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీడీలు శైల, వీరబాబు, బూరిబాబును, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావును హెచ్ఎం అభినందించారు.

కాకినాడలో ఘనంగా మహా కుంభాభిషేకం

- శివనామస్మరణతో మార్మోగిన సాగర తీరం





వివిధ ద్రవ్యాలతో శివలింగానికి అభిషేకాలు జరుపుతున్న దృశ్యం

కాకినాడ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హరిహర మహాదేవ నామస్మరణతో కాకినాడ సాగర తీరం గురువారం మార్మోగింది. ఆది కుంబేశ్వరస్వామి ఆలయం వద్ద 50 వ మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. భారత యజ్ఞ పీఠం కమిటీ ఆధ్వర్యంలో శివ భక్తుడు నామన రామచంద్రరావు కుటుంబ సభ్యులు ఉదయం గణపతి పూజతో ప్రారంభించి గోపూజ, ఆదికుంభేశ్వరునికి అభిషేకం, అనంతరం కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు, పాదరస లింగానికి మహా కుంభాభిషేకం జరిపారు. సాయంత్రం 108 మంది కన్యలతో అభిషేకం చేసిన ద్రవ్యాలను సాగరంలో నిమజ్జనం చేశారు. కమిటీ సభ్యుడు తోట పుండరీకాక్షులు (బాబీ) దంపతులు ప్రత్యేక పూజలతో పాటు స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపి మహిళలకు పసుపుతాళ్లు, పురుషులకు రుద్రాక్షలు అందజేశారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) విచ్చేసి ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ (రామ సేన) అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. సుమారు 10 వేల మంది భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు బీజేపీ నేతలు యెనిమిరెడ్డి మాలకొండయ్య, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, తోట పృథ్వీరాజ్, గంధం పల్లవరాజు, కమిటీ సభ్యులు బోగిరెడ్డి తాతారావు, సలాది శ్రీనివాసరావు, ఆరుముగం నటరాజ్, గంగిరెడ్డి అరుణ, నామన ప్రసన్న, బూర్ల మాత, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సూచన మేరకు కాకినాడ కుంభాభిషేకం రేవు పాటదారులు, బోట్ల యజమానులు, వర్తక సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో పది వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, నాయకులు ఎరిపిల్లి రాము, పి.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.




దర్శనం కోసం వేచియున్న భక్తులు

గోదావరి యానాం.. అత్యద్భుతం

సూర్యాస్తమయం.. అటుపై గోదావరి తీరం.. ఎటుచూసినా పసుపుమయం.. కాసేపటికి వచ్చెను ఎరుపువర్ణం.. యానాం రాజీవ్ గాంధీ బీచ్‌లో గౌతమీ గోదావరి వద్ద గురువారం కనిపించిన ఈ అద్భుతమైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా..

– యానాం (ఆంధ్రజ్యోతి)



ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్

-అంజమ్మ, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు



రంపచోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన టెక్ శంకర్ సహా నలుగురు మావోయిస్టుల మృతదేహాలకు గురువారం అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లు ముమ్మాటికీ బూటకమేనని, మావోయిస్టులను పోలీసులు పట్టుకొని తీసుకువచ్చి మారేడుమిల్లి అటవీప్రాంతంలో కాల్చేశారని, ఇది ముమ్మాటికీ రాజ్య హింసేనని, పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులను తక్షణం కోర్టులో హాజరుపర్చాలని అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ కోరారు.

బాల్యం నుంచే ఉద్యమం బాట

-మధుసూదన్‌రావు, టెక్ శంకర్ సోదరుడు



మూడో తరగతి చదువుకునేరోజుల్లోనే తన సోదరుడు టెక్ శంకర్ ఉద్యమబాట పట్టాడు. దొరికిపోయి చనిపోయాడని కొందరు, ఎదురు కాల్పుల్లో చనిపోయాడని కొందరు చెబుతున్నారు. బ్రతికి ఉంటే సంతోషించేవారం. ఇటీవల అమ్మ చనిపోయింది. ఇప్పుడు అన్నయ్య(టెక్ శంకర్) ప్రాణాలతో ఉంటే సంతోషించేవారం. ఎన్‌కౌంటర్‌లో అన్నయ్య చనిపోయాడని తమకు పోలీసులు సమాచారం ఇచ్చేవరకు తెలియదు. ఎన్‌కౌంటర్‌పై అనుమానాలున్నాయి. ఏం జరిగిందో పోలీసులకే తెలియాలి. వారి రాజ్యం వారి ఇష్టం. మృతదేహాన్ని ఇస్తే తీసుకెళ్లిపోతాం.

సత్యదేవుడికి రూ.8.40 కోట్ల ఆదాయం

- కార్తీకమాసంలో వ్రతాల సంఖ్య 1,34,476
- స్వామివారిని దర్శించిన 13 లక్షల మంది భక్తులు
- వెల్లడించిన అధికారులు

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాస వ్రతాల సంఖ్య లెక్క తేలింది. గురువారంతో కార్తీకమాసం ముగియడంతో వివరాలను అధికారులు వెల్లడించారు. వ్రతాల ద్వారా రూ.8.40 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది వ్రతాల సంఖ్య తగ్గిన విషయం విధితమే. గతేడాది కార్తీకమాసంలో 1,45,732 వ్రతాలు జరగగా ఈఏడాది 11256 లోటుతో 1,34,476తో ముగిసింది. అన్నవరం దేవస్థానంలో రూ.300, 1000, 1500, 2000 ధరల్లో వ్రతం టిక్కెట్లు అందుబాటులో ఉండగా వీటిలో ఆన్‌లైన్ టిక్కట్లతో కలిపి సామాన్యులు ఆచరించుకున్న రూ.300 ధర వ్రతాలు 96484 జరిగాయి. రూ.100 ధర వ్రతాలు 16099, రూ.1500 ధర వ్రతాలు 9511, రూ.2000 ధర వ్రతాలు 12382 జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది కార్తీక మాసంలో కేవలం వ్రతాల ద్వారా స్వామివారి ఖజానాకు రూ.8,40,74,700 ఆదాయం లభించింది. మిగిలిన విభాగాల నుంచి మరో రూ.11.50 కోట్లు కలిపితే కార్తీకమాస ఆదాయం సుమారు రూ.20 కోట్లు రావొచ్చని అంచనా వేస్తున్నారు. రెండోపర్యాయం హుండీల లెక్కింపు పూర్తయిన తరువాత అధికారికంగా కార్తీకమాస ఆదాయం వెల్లడిస్తామని ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. గతేడాది కంటే వ్రతాల సంఖ్యతో పాటుగా ఆదాయం కూడా సుమారు రూ.50 లక్షలనుంచి రూ.కోటి వరకు తగ్గవచ్చని అధికారులు భావిస్తున్నారు. కార్తీకమాసం అంతా కలిపి సుమారు 13 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో దేవస్థానం సిబ్బంది సమష్టి కృషితో భక్తులకు ఎక్కడా అసౌకర్యం, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పర్వదినాల్లో పశ్చిమరాజగోపురం వద్దనే ఉండి దళారుల ప్రవేశాన్ని నిరోధించి కేవలం వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే లిఫ్ట్‌సౌకర్యం పూర్తిస్థాయిలో అందించగలగడంతో పలువురి ప్రశంసలు పొందారు. కార్తీక పౌర్ణమి, స్వామివారి తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ, జ్వాలాతోరణం, పంపా హారతులు వంటి ముఖ్యమైన కార్యక్రమాలను నిర్దేశించిన సమయానికి నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. పోలీసులు కూడా ఎంతో కష్టించి భక్తులకు సేవలందించారు.

భగవద్గీత సారాంశం సకల మానవాళికీ దిక్సూచి

అన్నవరం దేవస్థానంలో 12 రోజులపాటు గీతాజయంతి వేడుకలు : ఈవో సుబ్బారావు


భగవద్గీతపై ప్రసంగిస్తున్న ఈవో సుబ్బారావు, హాజరైన విద్యార్థులు



అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలో శ్రీకృష్ణుడు, అర్జునుడికి ఉపదేశించిన భగవద్గీత సారాంశం సకల మానవాళికీ దిక్సూచీ అని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం దేవస్థానంలో శ్రీ మద్భగవద్గీత జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డిసెంబరు 1 వరకు రోజుకొక పాఠశాల విద్యార్థులకు భగవద్గీత పారాయణ,ధ్యానం, సజ్జనసాంగత్యం నిర్వహిస్తామని.. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తెలిపారు. గీతాజయంతి రోజున అన్నమయ్య 12వ తరం వారసులు తిరుమల శ్రీవారి ఆలయ సంకీర్తన కైంకర్యవర్యులు తాళ్లపాక స్వామీజీ విచ్చేస్తారని చెప్పారు. ఈ వేడుకలను గత 12ఏళ్లగా ఏడాదికి ఒకరోజు పెంచుకుంటూ ప్రతీ ఆలయంలో నిర్వహిస్తున్నట్లు గీతాజయంతి ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. గీతాసారాంశాన్ని చిన్నారుల్లోకి తీసుకెళ్లి సమాజానికి మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకి వనదుర్గ ఆలయంలో గురువారం అమావాస్య పర్వదినం పురస్కరించుకుని ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించారు. ఈ సందర్భంగా జపములు, పారాయణలు, హోమములు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండం లో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పులుల గణనపై శిక్షణ

చింతూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అఖిల బారత పులుల గణనపై శిక్షణా కార్యక్రమం గురువారం చింతూరు అటవీ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. శిక్షణ ఇచ్చేందుకు డెహ్రాడూన్ నుంచి వరల్డ్ వైల్డ్ ఫండ్ ఫర్ నేచర్ రీసెర్చ్ బయాలిజిస్ట్ సాయికృష్ణ బృందం వచ్చింది. ఈ మేరకు జంతు జాడను కనుగొనే మెళకవలను వివరించారు. చింతూరు డీఎఫ్‌వో రవీంద్రనాద్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే జనవరి నుంచి ఫిబ్రవరి వరకు క్షేత్ర స్థాయిలో 3సార్లు జంతు గణన చేపట్టాల్సి ఉంటుందన్నారు. సబ్ డీఎఫ్‌వోలు రాఘవరావు, శివకుమార్, రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతూరు డీఎఫ్‌వో రవీంద్రనాథ్ రెడ్డి, పాల్గొన్న చింతూరు డివిజనల్ స్థాయి సిబ్బంది



పెళ్లి పనులకు ఊరెళ్తే ఇల్లు గుల్ల

- పెద్దాపురంలో చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్
- నిందితుడిపై పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

పెద్దాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూతురికి పెళ్లి కుదరడంతో పనుల నిమిత్తం ఊరు వెళ్తే ఇంట్లోకి దొంగ చొరబడి నగదు, బంగారం దోచుకెళ్లాడు. ఈనెల 10న కాకినాడ జిల్లా పెద్దాపురం టెలికం కాలనీలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గురువారం పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరి రాజు విలేకర్లకు వెల్లడించారు. నిందితుడిని పట్టుకున్నట్టు చెప్పారు. వివరాల ప్రకారం.. పెద్దాపురం టెలికం కాలనీకి చెందిన పెంకే సింహాచలం ఆర్బీ పట్నం ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుమార్తెకు వివాహం కుదరడంతో రూ.5 లక్షల నగదు, అరకాసు బంగారం బెడ్‌రూమ్ బీరువా లాకర్‌లో భద్రపరిచాడు. పెళ్లి పనుల నిమిత్తం కుటుంబ సభ్యులంతా కాకినాడ వెళ్లారు. దీంతో అనూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి చరణ్ విఘ్నేష్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి లాకర్‌ను తెరిచి రూ.5 లక్షల నగదు, అరకాసు బంగారు వస్తువును దోచుకెళ్లాడు. రాత్రి 12 దాటిన తర్వాత ఇంటికి చేరుకున్న యజమాని ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. బెడ్‌రూమ్‌లోని బీరువాలో నగదు, బంగారు వస్తువు మాయం కావడం గుర్తించి పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ వి.మౌనిక కేసు నమోదు చేయడంతో సీఐ విజయశంకర్ దర్యాప్తు చేశారు. బుధవారం రాత్రి పెద్దాపురం నుంచి సామర్లకోట వెళ్లే రహదారిలో అయోధ్యాలయం గ్రాండ్ లేఅవుట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని సీఐ విజయశంకర్ అరెస్టు చేశారు. నిందితుడి దగ్గర నుంచి బంగారం, రూ.3.60 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, హోండా యాక్టీవా మోటారు సైకిల్, దొంగతనానికి ఉపయోగించే ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడిపై గతంలో చైతన్యపురం, మలక్‌పేట, అంబర్ పేట, సరూర్ నగర్, రాజమండ్రి వనస్థలిపురం, గండేపల్లి, ప్రకాష్‌నగర్, సర్పవరం, హయాత్ నగరం పోలీస్ స్టేషన్‌లలో పలు దొంగతనం కేసులు నమోదైనట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఫేక్ కాల్‌తో సైబర్ మోసం

- పోలీసులమంటూ ఓ వ్యక్తికి సైబర్ నేరస్తుల ఫోన్
- దొంగ బంగారం కొన్నారని కేసు పెడతామని బెదిరింపులు
- భయపడి రూ.30వేలు ఫోన్‌పే చేసిన బలభద్రపురం వాసి

బిక్కవోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా బలభద్రపురానికి చెందిన అమలాపురపు శ్రీనివాస్ ఫేక్ ఫోన్ కాల్‌తో సైబర్‌నేరస్తుల బారిన పడి రూ.30 వేలు పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించి బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాలప్రకారం.. గురువారం ఉదయం పది గంటలకు 9493191296 నెంబరు నుంచి శ్రీనివాస్‌కు ఫోన్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి మేం కుప్పం పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నాం. మీరు దొంగ బంగారం కొనుగోలు చేశారని, వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రావాలని లేకపోతే కేసు ఫైల్ చేస్తామని హెచ్చరించాడు. ఇలా పలుమార్లు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు రావాలని లేకపోతే రూ.50వేలు ఫోన్ పే చేయాలని ఒత్తిడి చేశాడు. దీంతో శ్రీనివాస్ సాయంత్రం రూ.30వేలు ఫోన్ పేచేశాడు. ఇది నకిలీకాల్ అని అతడి కుమారుడు గుర్తించాడు. తర్వాత పోలీసులను సంప్రదించారు. ఇది సైబర్ మోసమని తెలపడంతో శ్రీనివాస్ సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేశాడు. ఆ తరువాత 1930 నెంబర్ నుంచి కాల్ వచ్చి బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టుఇవ్వాలని సూచించడంతో వారు తమకు ఫిర్యాదు చేశారని ఎస్ఐ వివరించారు.

వరికోత యంత్ర పరికరాలు, 120 లీటర్ల డీజిల్ చోరీ

బిక్కవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరికోత యంత్రానికి సంబంధించిన మోటార్, డోర్లు చోరీకి గురయ్యాయని యంత్రం యజమాని వి.పవన్ గురువారం బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం సారభావరం గ్రామానికి చెందిన వి.పవన్‌కు హార్వెస్టర్ వరికోత యంత్రం ఉంది. యంత్రంతో వరికోత పనులకు వెళ్తుంటాడు. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురం గ్రామంలోని చొల్లంగి పడ్డయ్య పొలంలోని వరిని బుధవారం కొంతమేర కోతకోసి మిగిలిన వరిని మరునాడు కోద్దామని యంత్రాన్ని పొలంలోను ఉంచేశాడు. గురువారం ఉదయం వెళ్లేసరికి హార్వెస్టర్ యంత్రానికి సంబంధించిన రెండు సైడు డోర్లు, ఆగర్ మోటార్, త్రిషర్‌డోర్, 120 లీటర్ల డీజిల్ ఆయిల్ చోరీ అయినట్టు పవన్ గుర్తించాడు. వాటి విలువ రూ.60వేలు ఉంటుందని తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఆయిల్ ట్యాంకర్ సీజ్

ముగ్గురిపై కేసు

ఐ.పోలవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి ఎనిమిది వేల లీటర్ల డీజిల్ ఆయిల్‌తో పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటకు వెళ్తున్న ఒక ట్యాంకర్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎదుర్లంక వద్ద ఐ.పోలవరం పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ట్యాంకర్‌ను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు.


పోలీసులు సీజ్ చేసిన ఆయిల్ ట్యాంకర్

హుండీ లెక్కింపులో సేవకుడిగా వచ్చి.. రూ.60వేలు దోచేసి...

నిందితుడి అరెస్ట్

14 రోజుల రిమాండ్ విధింపు

ఆత్రేయపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో నగదును తస్కరించిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వివరాల ప్రకారం.. రామచంద్రాపురం మండలం వేగయమ్మపేటకు చెందిన వాసంశెట్టి శ్రీనివాసరావు బుధవారం వెంకన్న ఆలయంలో హుండీ లెక్కింపులో సేవకుడిగా పాల్గొన్నాడు. సిబ్బంది కళ్లుకప్పి రూ.60వేలు నగదు దొంగిలించగా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

ఆరోగ్య ఉప కేంద్రం ఖాళీ చేయాలి

వైద్యాధికారికి డిప్యూటీ డీఎంహెచ్‌వో నోటీసు

చింతూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఉప కేంద్రం ఖాళీ చేయాలని వైద్యుడికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.పుల్లయ్య గురువారం నోటీసు ఇచ్చారు. అల్లూరి జిల్లా కూనవరం మండలం కూటూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డా.శ్రీనివాసమూర్తి కొద్దికాలంగా తులసిపాకల ఆరోగ్యకేంద్ర పరిధిలోని చింతూరు ఆరోగ్య ఉపకేంద్రంలో నివాసముంటున్నారు. దీంతో ఉపకేంద్రంలో నిర్వహించాల్సిన ఏఎన్‌సీ క్లినిక్, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, రివ్యూ సమావేశాలతో సహా తదితర కార్యక్రమాలను నిర్వహణకు అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో విధిగా ఆరోగ్య ఉప కేంద్రం ఖాళీ చేయాల్సిందిగా డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆదేశించారు. అందుకు కేవలం 3 రోజులు మాత్రమే గడువు ఇచ్చారు. లేకపోతే స్థానిక సర్పంచ్, గ్రామ పంచాయితీ కార్యదర్శి, మండల రెవెన్యూ అధికారి, ఎస్ఐ సమక్షంలో పంచనామా నిర్వహించి ఆరోగ్య ఉపకేంద్రం స్వాధీన పర్చుకోవాల్సి వస్తుందని నోటీసులో హెచ్చరించారు.

కాకినాడ జిల్లాలో సారాపై ఉక్కుపాదం

1,306 కేసుల నమోదు... 965 మంది అరెస్ట్

136 గ్రామాలు సారా రహితంగా ప్రకటన

ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి

కాకినాడ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు సారాపై ఉక్కుపాదం మోపినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సారా నిర్మూలన లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని కలెక్టర్ షాన్ మోహన్ ఈ ఏడాది మార్చి 7న ప్రారంభించారన్నారు. అప్పటి నుంచీ జిల్లావ్యాప్తంగా ఉన్న 7ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 21 మండలాల్లో గల 136 గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది నిర్విరామ కృషితో సారాపై ఉక్కుపాదం మోపారన్నారు. మార్చి నుంచి ఈనెల 10వరకు 1,306 కేసులు నమోదు చేసి 965మందిని అరెస్టు చేసి 18,490 కిలోల నల్ల బెల్లం, 9,220 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సారా తయారీకి వినియోగించే 5,49,650 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 53 వాహనాలను సీజ్ చేశామన్నారు. 1,375 మందిని బైండోవర్ చేసి వారిలో నలుగురిపై పీడీ యాక్ట్ తెరిచామని చెప్పారు. బ్రీచ్ అయిన వారి నుంచి రూ.14,48,500 వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేశామన్నారు. పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారుల సహకారంతో నవోదయం 2.0ను విజయవంతం చేయగలిగామన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం 136 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించడం ఆనందదాయకమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి చెప్పారు.

సామర్లకోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గాంధీనగర్ నూకాలమ్మ గుడి ప్రాంతంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం కారణంగా గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌కు గురై పెద్దఎత్తున మంటలు చుట్టిముట్టాయి. దీంతో ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం అలుముకుంది. తరచూ ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక లోపాలకు గురవుతుందని స్థానికులు చేసిన ఫిర్యాదుల మేరకు బుధవారమే ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి గురువారం విద్యుత్ సరఫరా తిరిగి పునరుద్ధరించిన గంట సమయానికే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి మొత్తం బుగ్గి అయ్యింది. స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకునివిద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.


ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

అమలాపురం

అంగన్‌వాడీ కార్యకర్తల అభివృద్ధికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



నియామక ఉత్తర్వుల కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

ముమ్మిడివరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు సక్రమంగా ప్రజలకు చేరవేసి బాధ్యతాయుతమైన సేవలు అందించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 4687 మినీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులుజారీ చేసింది. దీనిలో భాగంగా ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తొమ్మిది మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటికి సంబంధించి జిల్లా కలెక్టర్, అంగన్‌వాడీ కార్యకర్తల ఆయాల నియామకపు కమిటీ అధ్యక్షుడు ఆర్.మహేష్‌కుమార్ కార్యకర్తల నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆయా కార్యకర్తలకు సుబ్బరాజు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.నిహారిక, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలి

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయయణ



మినీ అంగన్‌వాడీ టీచర్లకు నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహ ణలో బాధ్యతాయుతంగా పనిచేసి చిన్నారులకు విశేష సేవలందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచి ంచారు. పి.గన్నవరం జనసేనక్యాంపు కార్యాలయంలో గురు వారం మినీ అంగన్వాడీ సెంటర్లటీచర్లకు మెయిన్ అంగన్వా డీలుగా పదోన్నతి పత్రాలు అందించి అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం అందించే ప్రోటీన్‌లతో కూడిన ఆహారాన్ని చిన్నారులకు విధి గా అందించాలన్నారు. ప్రాజెక్టు పరిధిలో 24మినీ అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా రూపాంతరం చెందాయన్నారు. ప్రాజెక్టు పరిధిలో 29సెంటర్లు మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మారాయన్నారు. అనంతరం సీడీపీ వో వై.విజయశ్రీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను అంగన్వాడీలు సన్మానించారు. ప్రాజెక్టు పరిధిలో సూపర్‌వైజర్లు, సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అయినవిల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం సిరిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అయినవిల్లి, నేదునూరు గ్రామాల్లో సబ్సిడీ పశువుల దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిట్టూరి శ్రీనివాస్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ కాకర శ్రీనివాస్, పోలిశెట్టి రాజేష్, కడలి వెంకటసత్యనారాయణ, సర్పంచ్ కాకర శ్రీనివాస్, విళ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

కాల్వగట్ల కొబ్బరిచెట్లపై ఆదాయం వసూలు చేయండి

● ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాల్వలు, డ్రెయిన్లు, ఏటిగట్ల పక్కన ఉన్న కొబ్బరిచెట్లపై ఫలసాయం ఎవరు పొందుతున్నారు అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నీటి పారుదల సలహామండలి సమావేశంలో ప్రశ్నించినట్టు తెలిపారు. కాల్వగట్లు, డ్రెయిన్లు, ఏటిగట్ల పక్కన కొబ్బరిచెట్లను గుర్తించి వాటి నుంచి ఆదాయాన్ని వసూలుచేసి నీటిసంఘాలకు ఇవ్వడం ద్వారా మేలు జరుగుతుందని సమావేశం దృష్టికి తెచ్చినట్టు తెలిపారు. గత ఐదేళ్లలో ఏమైనా వసూలు చేశారా అని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించినట్టు ఆయన చెప్పారు. చెట్టుకు కొద్ది మొత్తంలో వసూలుచేసినా చాలా ఆదాయం వస్తుందని, ప్రభుత్వం ఏమీ ఇవ్వడంలేదు అనడం కంటే ఉన్న వనరులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇరిగేషన్ భూములు చాలాచోట్ల అక్రమాలకు గురయ్యాయని, ఆక్వాచెరువులు తవ్వేశారని, వాటిని గుర్తించి తగుచర్యలు తీసుకోవాలని ఆయన సమావేశం దృష్టికి తెచ్చినట్టు చెప్పారు.

హిందూ దేవాలయాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్టు ప్రణాళిక

మలికిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్టు ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం సహకారం అందిస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. రూ.50లక్షల వరకు దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. కొత్త హిందూ దేవాలయాలు లేదా పాత దేవాలయాల పునఃనిర్మాణం, అసంపూర్తి దేవాలయాలను పూర్తిచేయడం, మరమ్మతులు చేసేందుకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. రూ.50లక్షల ఆర్థిక సహాయం పొందగోరేవారు 25శాతం భక్తుల నుంచి విరాళాలు సేకరించాలని, మిగిలిన రూ.37.50లక్షలు శ్రీవాణి ట్రస్టు ద్వారా అందుతుందన్నారు. గ్రామస్థాయి నాయకులు స్వచ్ఛంద సంస్థలు, ఆలయ అధికారులు హిందూ దేవాలయాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన కేంద్రాలు

● ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు
● విజేతలకు బహుమతుల అందజేత



అమలాపురంలో విద్యార్థులకు బహుమతులు అందజేసిన జిల్లా ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశం



ముమ్మిడివరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వీరాస్వామి



పి.గన్నవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



అంతర్వేదిలో బహుమతులతో విద్యార్థులు

అమలాపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన కేంద్రాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి ఖాళీ సమయాల్లో గ్రంథాలయాల్లో గడపడం ప్రతీ విద్యార్థి అలవాటుగా చేసుకోవాలన్నారు. అమలాపురం ప్రథమశ్రేణిశాఖ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ గురువారం గ్రంథాలయ అధికారి జీవీఆర్ ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగాహాజరైన సూర్యప్రకాశం మాట్లాడుతూ ఆధునిక సమాజంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత అంతకంతకూ పెరుగుతుందన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ, మున్సిపల్ హైస్కూలు హెచ్‌ఎం కాశి ఘనసత్యనారాయణ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.రామకృష్ణ, వై.ధర్మారావు, గ్రంథాలయ సిబ్బంది బి.సత్యనారాయణమూర్తి, ఆకుల నారాయణరావు, కె.శ్రీనివాస్, ఎ.భవానీ, మహబూబ్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ముమ్మిడివరం గ్రంథాలయ కార్యాలయంలో విజేతలకు బహుమతులు అందించారు. వారోత్సవాల సందర్భంగా ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో విజేతలకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ విళ్ల వీరాస్వామినాయుడు, గుడిమెట్ల సుబ్బారెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.హనుమంతరావు, జాగు రాంబాబు, శీలం వెంకటరమణ, జాగు సత్తిబాబు, చంద్రశేఖర్, నిమ్మకాయల విస్సు, పోలిశెట్టి కృష్ణ, లైబ్రేరియన్ శీలం నాగరాజులతోపాటు పలువురు పాల్గొన్నారు.

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా పి.గన్నవరం గ్రంథా లయాధికారి జి.రవికుమార్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, మండలపరిషత్ పరిపాలనాధికారి వీఎస్‌వీ శర్మ బహుమతులు, సర్టిఫికెట్స్‌ను అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సాకాసత్యం, కుసుమ ప్రభుదాస్, వ్యాయమ ఉపాధ్యాయుడు సీహెచ్ వెంకటేష్, నేలపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

అంతర్వేది(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగిన ఈ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు.పాల్గొన్న విద్యార్థులతో పాటు విజేతలకు మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర, రవిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మందపాటి రత్నంసత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు కనకలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, గ్రంథాలయ దాతలు అల్లూరి సత్తిబాబు, సత్యనారాయణరాజు, బుల్లిబాబు, గ్రంథాలయ అధికారిణి వై.వెంకటలక్ష్మి, వై.రత్నరాజు పాల్గొన్నారు.

రావులపాలెంలో చెకుముకి సైన్సు సంబరాలు

మలికిపురం(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న జిల్లాస్థాయి చెకుముకి సైన్సు సంబరాలు రావులపాలెం బాలికోన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని జిల్లా జనవిజ్ఞాన వేదిక ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతీ మండలం నుంచి ప్రైవేటు పాఠశాల నుంచి ఒకజట్టు, ప్రభుత్వ పాఠశాల నుంచి ఒక జట్టు సైన్స్ సంబరాల్లో పాల్గొంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత పరీక్షతోపాటు మౌఖిక పరీక్ష సైన్స్ ప్రయోగాలు ఉంటాయన్నారు. విజ్ఞానదాయకమైన సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద భరితమైన మ్యాజిక్ షో మొదలైన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనిపల్లి సత్యనారాయణ, పీవీవీ వరప్రసాద్ తెలిపారు.

'సాంకేతికతతో ముందుకు సాగాలి'



విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఎంవో సుబ్రహ్మణ్యం

మామిడికుదురు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక టెక్నాలజీని వినియోగించుకుని ముందుకు సాగాలని సమగ్రశిక్ష జిల్లా సీఎంవో పీవీవీ సుబ్రహ్మణ్యం కోరారు. గురువారం మామిడికుదురుశాఖ గ్రంథాలయంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు ఏర్పాటుచేసిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో ఎం.వెంకన్నబాబు, స్కూలు హెచ్‌ఎం బి.చిరంజీవిరావు, గ్రంథాలయ నిర్వాహకుడు సూర్యనారాయణ, బీడీసీ యెరుబండి కన్నబాబు, ఉపాధ్యాయులు కేశవరావు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన కేంద్రాలు



భీమనపల్లి గ్రంథాలయంలో ప్రముఖులను సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారులు

ఉప్పలగుప్తం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు కేంద్రాలని ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భీమనపల్లిలో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తాము గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం చేస్తామని విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ప్రముఖులను గ్రంథాలయ అధికారులు సన్మానించారు. ఉప్పలగుప్తం గ్రంథాలయంలో జరిగిన ముగింపు వేడుకల్లో సర్పంచ్ కడిమి చిన్నవరాజు పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో జి.కృష్ణ, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, ఎంపీటీసీ నాగులపల్లి శేషవేణి, గ్రంధాలయాధికారులు శేషుకుమార్, నాగేశ్వరరావు, బాబులు, మధు పాల్గొన్నారు.

26న రాజ్యాంగ దినోత్సవ సభ



అమలాపురంలో రాజ్యాంగ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలను రక్షించుకోకపోతే ప్రజాస్వామ్యానికే తీరని ముప్పు అంటూ ఈనెల 26న అమలాపురం కలెక్టరేట్ ఎదుట అంబేడ్కర్ భవన్‌లో రాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు నాయకులు తెలిపారు. రాజ్యాంగ దినోత్సవ సభకు ముఖ్య అతిథులుగా నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ అంజయ్య, మానవహక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్ర నాయకుడు వీఎస్ కృష్ణ, వివిధ సంఘాల నాయకులు డాక్టర్ చల్లా రవికుమార్, దేవరపల్లి మంజుల, కేఎంఏ సుభాన్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను, విలువలను తుంగలో తొక్కి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని వక్తలు విమర్శించారు. ఈస ందర్భంగా రాజ్యాంగ దినోత్సవ కరపత్రాలను అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఆవిష్కరించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమర్తి రవి, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, వివిధ పార్టీలు, సంఘాల రాష్ట్ర నాయకులు పెనుమాల సుధీర్, రేవు తిరుపతిరావు, కొండా దుర్గారావు, గుదే దుర్గాప్రసాద్, ఎస్.తులసీరావు, ముత్తాబత్తుల రమణ, సతీష్ పాల్గొన్నారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవ సభ ఈనెల 26న అమలాపురంలో జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు రాజ్యాంగ దినోత్సవ సభ జరుగుతుందని ముత్యాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పూలే అంబేడ్కర్ భవన్‌లో కరపత్ర ఆవిష్కరణ చేశారు. మహ్మద్‌అబ్దుల్ హమీద్, గెడ్డం తులసీభాస్కర్, దీపాటి ప్రసాద్, మంద సత్యనారాయణ, గెడ్డం ఫిలిప్‌రాజు, చవ్వాకుల వెంకట్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే గొల్లపల్లి



గవర్నర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి

యానాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌ను కలిసి యానాం పెండింగ్ అంశాలపై వివరించారు. యానాంలో దరియాలతిప్ప ఐలాండ్ నెంబరు3లో జరిగిన గ్యాస్ లీకేజీ సంఘటనకు సంబంధించి తమ సమస్యలు పరిష్కారించాలని దరియాలతిప్పలో గ్రామంలో 38రోజుల పాటు పార్టీలకు అతీతంగా శాంతియుతంగా ధర్నా చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రజల సహనాన్ని పరీక్షించకుండా సమస్యను పరిష్కారించాలన్నారు. అనంతరం ఈ అంశంపై గవర్నర్ పుదుచ్చేరి కలెక్టర్‌తో చర్చిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో పుదుచ్చేరి కలెక్టర్ యానాం వచ్చి చమురుసంస్థల ప్రతినిధులతో చర్చించి తగిన పరిష్కారం చేయనున్నారని గొల్లపల్లి తెలిపారు. యానాంకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

నిధుల్లేక నిలిచిన అమలాపురం- చల్లపల్లి ప్రధాన పంటకాల్వ పూడికతీత పనులు



పంటకాల్వను పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్

ఉప్పలగుప్తం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమలాపురం- చల్లపల్లి ప్రధాన పంటకాల్వ ద్వారా చల్లపల్లికి సాగునీరు అందాలంటే పూర్తిస్థాయిలో పూడికతీత, ఆక్రమణలు తొలగింపు చేపట్టాలని ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబు అన్నారు. అమలాపురం రూరల్ మండలం సమనస లాకుల నుంచి చల్లపల్లి వరకు దశాబ్దాల అనంతరం ప్రస్తుతం ప్రధాన పంటకాల్వలో పూడికతీత పనులు చేపట్టారు. నిధుల కొరతతో పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. కాల్వలో తూడు తొలగింపునకు రూ. 3లక్షల బడ్జెట్ మాత్రమే ఉందని అధికారులు స్పష్టం చేశారు. సమనస లాకుల నుంచి చల్లపల్లి వరకు 9 కి.మీ మేర పూడికతీత, గట్లపై చెట్ల తొలగింపు పనులు చేశారు. కాగా లాకుల నుంచి గోపవరం వరకు ఆర్ అండ్ బీ రహదారి వైపు పనులు నిలిచిపోయాయి. నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోయినట్టు నీటి పంపిణీ సంఘం చైర్మన్ చిట్టిబాబు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన ఇరిగేషన్ ఉన్నతాధికారులను రప్పించి కాల్వ పరిస్థితిని చూపించారు. నీరంతా సమనస లాకుల వద్ద నుంచి కిత్తనచెరువు వరకు పొలాలను ముంచేస్తుండగా దిగువ ప్రాంతాలకు నీరందడం లేదు. దీనికి కారణం పంటకాల్వ మట్టితో పూడుకుపోవడమేనని ఆయన అధికారులకు వివరించారు. ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్, ఈఈ కాశి వెంకటేశ్వరరావు, డీఈఈ శ్రీరామ్‌జనార్ధన్, ఏఈ శివరామకృష్ణ కాల్వను పరిశీలించారు. నీటి సంఘాల చైర్మన్లు, రైతులు సాగు నీటి కష్టాలను అధికారులకు వివరించారు. సార్వా, దాళ్వా సీజన్లలో కిత్తనచెర్వు దాటి సాగునీరు దిగువకు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో కాల్వలో మెరకలు, పూడికతీత చేపట్టాలంటే మొత్తం రూ. 10.50లక్షల వరకు ఖర్చవుతుందని అధికారుల అంచనా. ఇప్పటి వరకు రూ.5.50లక్షలు ఖర్చయినట్టు డీసీ తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎస్ఈ, ఈఈలు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్.యానాం, గోపవరం నీటి సంఘాల చైర్మన్లు పోలిశెట్టి ఉమామహేశ్వరరావు, ఆకుల వెంకటరమణ, చల్లపల్లి నీటి సంఘం వైస్ చైర్మన్ సుంకర రాంబాబు, రైతులు పాల్గొన్నారు.


పవర్ లిఫ్టింగ్ పోటీలకు ముక్కామల విద్యార్థుల ఎంపిక



దినేష్‌ప్రసాద్, యశ్వంత్‌సుజికుమార్

అంబాజీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అమలాపురం ఇందుపల్లిలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో ముక్కామల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీహరిప్రసాద్, పీడీ ఎంఎస్ పవన్‌లు తెలిపారు. ముక్కామల హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి జి.దినేష్‌ప్రసాద్, వై.యశ్వంత్‌సుజికుమార్‌లు 74కేజీల విభాగంలో, 93కేజీల విభాగాలలో ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థులను డీఈవో షేక్ సలీంబాషా, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బి.శ్యాముల్‌రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా సంబంధిత యాజమాన్యాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాఠశాలలు, సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల ప్రాంగణాల్లో పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమనసలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ విద్యార్థుల వసతిగృహాన్ని సబ్ యూనిట్ అధికారి ఎన్వీ రామారావుతో కలిసి గురువారం వెంకటేశ్వరరావు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. జ్వరాల బారిన పడిన విద్యార్థులతో మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

'ఐక్యతను దెబ్బతీసేందుకే కుట్ర'

ముమ్మిడివరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో ఎస్సీ ఉపకులాల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అతిపెద్ద రాజకీయ కుట్ర చేస్తుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చరిత్రలోనే అతిపెద్ద రాజకీయకుట్ర అని వర్గీకరణవల్ల వంద మందిలో కేవలం నలుగురికి మాత్రమే మేలు జరుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేయకుండానే ముఖ్యంగా ఉభయతెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయపార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్‌చేసి అణచివేసేందుకు ఎస్సీ వర్గీకరణకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కొంకి వెంకట్రావు, చీకురుమెల్లి కిరణ్‌కుమార్, గుర్రాల రాంబాబు, సుందరరావు, దుర్గాప్రసాద్, సూరిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ పనుల పరిశీలన

యానాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యానాం శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణపనులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, తిరుమల తిరుపతి దేవస్థానం స్తపతి పరిశీలించారు. ఇప్పటికే యానాం దాతలు, టీటీడీ సహకారంతో మొదటి దశ పనులు పూర్తి కావస్తున్నాయి. రెండో దశ పనులకు సంబంధించి మల్లాడి పుదుచ్చేరి ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో వచ్చిన నిధులను టీటీడీకి అందజేయడంతో రెండోదశ పనులు ప్రారంభించాల్సి ఉంది. తిరుపతి నుంచి వచ్చిన బృందం ఆలయ నిర్మాణ పనులు పరిశీలించారు.

తీరంలో సాగర్ కవాచ్

అంతర్వేది, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల వెంబడి మెరైన్, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో సాగర్ కవాచ్ నిర్వహించారు. తీరం వెంబడి అపరిచితులు గ్రామాల్లోకి రాకుండా తీరంలో పటిష్ట చర్యలు చేపట్టాలన్నది మెరైన్ పోలీసులు సాగర్ కవాచ్ బృందాలుగా ఏర్పడి పోలీసుల్లో ఒకరిని అనుమానితుడిగా పట్టుకుంటారు. మెరైన్, సివిల్ పోలీసులు తీరంలో పర్యవేక్షణ చేస్తారు.

రంగాపురంలో మృత్యుంజయ పాశుపత రుద్రాభిషేకం




అమలాపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వెలువలపల్లి శివశర్మ ఆధ్వర్యంలో నెల రోజులుగా మహామృత్యుంజయ పాశుపత రుద్రాభిషేకం నిర్వహించారు. రాష్ట్రాధినేత చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కూటమి ఎమ్మెల్యేలు అందరూ మంచిగా పాలనచేస్తూ రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచాలని కోరుకుంటూ చేపట్టిన హోమంలో మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అనురాధ దంపతులు పాల్గొన్నారు. 19ఏళ్లుగా మహామృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ వేద పురోహితుడు శివశర్మ తెలిపారు.

అమలాపురం జడ్పీ పాఠశాల 150వ సంవత్సరాల ఉత్సవాలు

అమలాపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. గురువారం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా 150వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. దేశవిదేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. చాగంటి కోటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో పాటు ప్రముఖులు పాల్గొంటారని సూర్యనారాయణరావు వివరించారు.

వాకర్స్ హెల్త్‌క్లబ్‌కు 4 అవార్డులు



అమలాపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్‌కు జిల్లాస్థాయిలో నాలుగు అవార్డులురాగా ఉత్తమ ప్రెసిడెంట్‌గా బోనం సత్యవరప్రసాద్ అవార్డును అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి చేతులమీదుగా అందుకున్నారు. డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, డాక్టర్ పీఎస్ శర్మ, తేతల సత్యనారాయణరెడ్డి, గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, పట్నాల రమణ, వై.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణకు అవకాశం

ముమ్మిడివరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం పట్టణంలో అనధికార భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. 2025 ఆగస్టు 31కి ముందు అనధికారికంగా నిర్మించిన భవనాలు, ప్లాన్‌లకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతి పొడిగిస్తూ ఈనెల 12వ తేదీన ఆదేశాలు జారీ చేసిందన్నారు. పట్టణ ప్రజలు 2025 ఆగస్టు 31కి ముందు అనుమతి పొంది ఉండి ప్లాన్‌లకు విరుద్ధంగా నిర్మించిన, ప్లాన్‌ల అనుమతి పొందకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు.

ఆపదలో రక్షణగా క్యూఆర్ కోడ్ విధానం

పి.గన్నవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సభ్యుల వ్యక్తిగత వివరాలతో కూడిన క్యూఆర్ కోడ్ విధానం ఆపదలో రక్షణ కవచంలా నిలుస్తోందని ఎస్ఐ బి.శివకృష్ణ అన్నారు. పి.గన్నవరం మండల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ భవనం నందు గురువారం ఏర్పాటుచేసిన ఫోటోగ్రాఫర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాహనాలపై వెళ్లే సమయంలో ఏదైనా ఆపదవస్తే సంబంధిత వాహనంపై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా ప్రమాదానికి గురైన వ్యక్తి పూర్తిస్థాయి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. అదేవిధంగా జిల్లా ఫోటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు గెడ్డం సురేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1400మంది ఫోటో గ్రాఫర్స్ ఉన్నారని వారందరికీ ఒక వెబ్‌సైట్ ద్వారా క్యూఆర్‌కోడ్‌ను రూపొందిం చామని తెలిపారు. తొలుత ఫోటో కెమెరా సృష్టికర్త లూయిస్‌డాగూరే చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్ఐ, జిల్లా అధ్యక్షులను యూనియన్ సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.అబ్దుల్‌కలామ్ చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ భీమాల వెంకటేశ్వరావు, యూనియన్ అధ్యక్షులు పి.బాలాజీ, కార్యదర్శి పి.శివకుమార్, ట్రెజరర్ షేక్ దొరబాబు, ఉపాధ్యక్షులు మామాజీ, శ్రీనివాసరావు, వెంకన్న పాల్గొన్నారు.

24న సమగ్రశిక్ష ఉద్యోగుల పోరాట దీక్ష

అంతర్వేది, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం ఎంఈవో కార్యాలయంలో సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ పిలుపుమేరకు ఈ నెల 24వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పోరాట దీక్ష చేస్తామని మండల కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావులకు వినతిపత్రం అందించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఎంతోకాలంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. డిసెంబరు 10న చలో విజయవాడ పోరాట సభ నిర్వహిస్తామని తెలిపారు. డి.శ్రీనివాస్, సంధ్యదేవి, వినయమాధురి, లక్ష్మీబాయి, రత్నరాజు, కిశోర్ పాల్గొన్నారు.

కనుల పండువగా కార్తీక దీపోత్సవం

ఐ.పోలవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాస ముగింపు సందర్భంగా మురమళ్ల శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామి సన్నిధిలో గురువారం రాత్రి నిర్వహించిన కార్తీక దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. దేవతామూర్తుల విగ్రహాలు ఏర్పాటుచేసి దీపాలంకరణ చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ, టీడీపీ నాయకులు దాట్ల పృధ్వీరాజు, దాట్ల ఇంద్రరాజు, బాబు, సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజుతోపాటు ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించాలి

● మున్సిపల్ శాఖా మంత్రిని కోరిన ఎమ్మెల్యే ఆనందరావు



మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురం అభివృద్ధిని కోరుతూ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రత్యేక నిధులు కేటాయించాలని మున్సిపల్ శాఖమంత్రి నారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. పురపాలక సంఘంలో డ్రెయిన్లు, రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం అందించారు. డిసెంబరు నెలలో అమలాపురంలో పర్యటించి పరిస్థితులను గ్రహించి అందుకు తగ్గట్టుగానే నిధులు కేటాయించాలని కోరగా మంత్రి పి.నారాయణ స్పష్టమైన హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

మండపేట

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిళ్లకుర్రు 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం బిళ్లకుర్రు, వానపల్లి మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.రాంబాబు తెలిపారు.



చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో చండీహోమం జరుపుతున్న దృశ్యం

చండీ హోమానికి పోటెత్తిన భక్తజనం

ఆలమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో కార్తీకమాసం ఏకాదశి సందర్భంగా నిర్వహించిన చండీ హోమానికి భక్తులు పోటెత్తారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చండీహోమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమావాస్య కావడంతో హోమంలో పాల్గొనడానికి ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తుల రాకతో సందడి నెలకొంది. వేద పండితులు ఈ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించడంతో పాటు పలు రకాల ద్రవ్యాలు వేశారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ అప్పారావుతోపాటు పలువురు నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం

కపిలేశ్వరపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం గౌతమీ గోదావరి నదిలో స్వామివారి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో కృష్ణ చైతన్య పర్యవేక్షణలో గురువారం రాత్రి అగస్త్యేశ్వర, పాపవినాసేశ్వరస్వామి, జనార్దన స్వామివార్లను గ్రామం లో ఊరేగించారు. అనంతరం గౌతమీ నదీతీరాన స్వామివార్లకు వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి గోదావరి నదిలో తెప్పోత్సవాన్ని జరిపారు. ఎస్‌ఐ హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బ్యాటరీ వాహనంలో వెళుతున్న భక్తులు

బ్యాటరీ వాహనాల్లో రయ్...రయ్

• వాడపల్లికి వచ్చే భక్తుల హర్షాతిరేకాలు • దాతలకు కృతజ్ఞతల వెల్లువ

ఆత్రేయపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి దాతలు సమకూర్చిన బ్యాటరీ వాహనాలు భక్తులతో రయ్ రయ్ మంటూ పరుగులు పెడుతున్నాయి. ఇటీవల రెండు బ్యాటరీ వాహనాలను జంపన కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఇవ్వగా, మరో రెండు పెద్ద బ్యాటరీ వాహనాలను విక్టరీ గ్రూప్ సంస్థ విరాళంగా ఇచ్చాయి. వృద్ధులు, వికలాంగులు, చంటి పిల్లల తల్లులను ఈ వాహనాల్లో స్వామి వారి క్షేత్రానికి తరలిస్తున్నారు. వాడపల్లి కొత్త వంతెన వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ బ్యాటరీ వాహనాల్లో స్వామివారి సన్నిధికి ఉచితంగా చేరుకుంటున్నారు. వృద్ధులు, చిన్నారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

రాయవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా కృషి చేయాలని ఎంపీడీవో ఎస్. కీర్తి స్పందన కోరారు. గురువారం రాయవరం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఐటీసీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పంచాయ తీ కార్యదర్శులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లకు బదులుగా వస్త్రాలతో చేసిన సంచులను వినియోగించాలన్నారు. అనంతరం గ్రామస్తులు, వ్యాపారులతో ప్లాస్టిక్ కవర్లకు బదులుగా క్లాత్ సంచులను వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పల్లెటి వెంకటరత్నం, ఐటీసీ సంస్థ తరపున రాజబాబు, విజయ్, వల్లూరి శ్రీనివాస్, జనసేన నేత దేవిశెట్టి కోటేశ్వరరావు, వ్యాపారవేత్త వెలగల ఫణికృష్ణారెడ్డి, ఏఎస్‌ఐ రాంబాబు, గ్రామస్తులు, వ్యాపారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



మండపేటలో జరిగిన ఏపీఎన్‌జీవో తాలుకా అసోసియేషన్ యూనిట్ ఎన్నికల్లో ఎంపికైన కార్యవర్గ సభ్యులు

ఏపీఎన్‌జీవో కార్యవర్గం ఎన్నిక

మండపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే లక్ష్యంగా ఎన్‌జీవో సంఘం పనిచేస్తుందని సంఘ ప్రతినిధులు చెప్పారు. మండపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండపేట ఏపీఎన్‌జీవో అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉద్యోగ సంఘ నాయకులు చిక్కాల సూర్యభాస్కరరావు, కాశి విశ్వేశ్వరరావు, జి.వేంకటేశ్వరరావు సారథ్యంలో సంఘ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సంఘ అధ్యక్షుడిగా మూడవసారి జుత్తుగ మల్లిఖార్జునుడు, ఉపాధ్యక్షులుగా డి.సుధాకర్, కేడీ ప్రసాద్, జాయింట్ కార్యదర్శిలుగా ఎన్.సతీష్‌కుమార్, సీహెచ్ రామకృష్ణ, జాయింట్ కార్యదర్శులుగా ఎం.శ్రీనివాస్‌దొర, జి.పద్మలత, కార్యదర్శిగా రామకృష్ణ, ట్రెజరర్‌గా డి.దుర్గాశ్రీనువాస్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండపేట మండలం ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి, కపిలేశ్వరపురం వ్యవసాయం సంచాలకులు బలుసు రవి తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ ముగింపు వారోత్సవాల సందర్భంగా మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు



కె.గంగవరంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కూటమి నాయకులు

విజ్ఞానం పెరిగేందుకు గ్రంథాలయాలు దోహదం

• గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో వక్తలు • విద్యార్థులకు బహుమతులు అందజేత

కపిలేశ్వరపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానం పెరిగేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీడీవో హెచ్.భానూజీరావు, తహసీల్దార్ జి.శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ విద్యార్థులకు సూచించారు. గురువారం కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి దానేటి శివకుమారి అధ్యక్షతన జరిగిన గ్రంథాలయాల వారోత్సవం ముగింపు సభలో వారు మాట్లాడారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెరిగినప్పుడే పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నతస్థితికి చేరుకోవచ్చన్నారు. గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానవంతులు కావాలని విద్యార్థులకు వివరించారు. అనంతరం గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. గ్రంథాలయ స్థాపన నుంచి రెగ్యులర్ పాఠకుడిగా ఉన్న మాజీ సర్పంచ్ మేకా ప్రసాద్ ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శీలం భాస్కరరావు, మండల పరిషత్ ఏవో రాజేంద్రప్రసాద్, ఆర్‌ఐ శ్రీనివాస్, వీఆర్‌వో సత్యనారాయణ, హిందీ టీచరు రామరాజు, రిటైర్డ్ టీచర్ చిట్టూరి సత్యనారాయణ, ఉపాధ్యాయుడు సీహెచ్ నాగేంద్రప్రసాద్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

ఆత్రేయపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో 58వ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఎంపీడీవో వెంకటరామన్, ఎంఈవో ప్రసాదరాజు, సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు ముదునూరి రామభద్రరాజు, దేవస్థానం చైర్మన్ వేగేశ్న ప్రసాదరాజు పాల్గొన్నారు. పుస్తక పఠనం ద్వారా ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. వారోత్సవాల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి తంబా నమ్మశివాయ పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

కొత్తపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా ఉత్తమ లక్ష్యాలు సాధించుకోవచ్చునని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. గురువారం కళాశాల గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకను నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఎస్ రాణి, ఎన్‌వీవీ జానకీరామ్, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.అంకంరావు, డాక్టర్ జి.శ్రీనివాసులు, కెఎస్ఎస్ ప్రసాద్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం దోహదం

కె.గంగవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజలను ప్రాథమికంగా చైతన్యవంతులను చేసేవి గ్రంథాలయాలని గోదావరి కవి డాక్టర్ ర్యాలి శ్రీనివాసు అన్నారు. గురువారం పామర్రు శాఖా గ్రంథాలయంలో 58వ వార్షికోత్సవ ంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు మరివాడ సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని, స్థానిక విద్యావంతులు వీటి అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో భద్రరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఈశ్వరుడు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓవీ రమణ, లైబ్రేరియన్ ఎస్.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతోనే జ్ఞాన సముపార్జన

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథ పఠనం ద్వారానే జ్ఞాన సముపార్జన సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం స్థానిక రత్నంపేట ఉన్నతపాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో వారు పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, గ్రంథాలయాధికారి జీవీవీఎస్ త్రినాథ్ , టీడీపీ పట్టణ అధ్యక్షుడు వుండవిల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో: ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. సమావేశంలో ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాస్ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎంవీ సూరిబాబు, విజ్ఞాన భారతి కరస్పాండెంట్ ఎం.శివాజీ, ఎండీ హుస్సేన్, బి.శివరావు తదితరులు పాల్గొన్నారు.



పదమరఖండ్రిక ధ్యాన మందిరంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

కపిలేశ్వరపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ధ్యాన శిక్షకుడు సంగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం పడమరఖండ్రికలోని ఉయ్యాల జంపాల క్షేత్రం వద్దనున్న ఋణ్వామహర్షి పిరమిడ్ ధ్యానమందిరంలో నిర్వహించిన శ్వాసపై ధ్యాస శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధ్యానం ద్వారా ఆరోగ్య, మానసిక రుగ్మతల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. ప్రజలు శాఖాహారంపై మొగ్గుచూపాలని సూచించారు. దివంగత బ్రహ్మర్షి పత్రీజీ ఆశయం మేరకు ఆయా గ్రామాల్లో పిరమిడ్ మందిరం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ధ్యాన శిక్షకులకు వనుం సత్యనారాయణ, భాగ్యవతిలు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వల్లూరి వీవీవీ చౌదరి తదితరులతో పాటు ధ్యానశిక్షకులు పాల్గొన్నారు.

కూళ్ల కార్యదర్శికి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి

కె.గంగవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న ముద్రగడ సత్యనారాయణ మూర్తికి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. దీనికి సంబంధించి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పదోన్నతి పొందిన ఆయన్ను ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసు, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ సురేంద్ర రెడ్డి, గ్రామ కార్యదర్శులు సత్యనారాయణ, గౌరీ శంకర్, సూర్య గౌతమి, ప్రసాద్, జెమ్మీ తదితరులు అభినందించారు.

పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వద్దు

ఆలమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వహించకుండా ఎప్పటికప్పుడు చెత్త సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎ.రాజు పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు సూచించారు. మండలంలోని గుమ్మిలేరు, జొన్నాడ తదితర గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరణ వాటి ద్వారా సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను కలిసి మనమిత్ర యాప్ ద్వారా లభించే సేవలు, యాప్‌లపై తెలిపారు.

మాజీ మంత్రి సంగిత వియ్యంకుడు మృతి

ఆలమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి వియ్యంకుడు దొడ్డా పుల్లయ్య(90) గురువారం సంధిపూడిలో మృతి చెందారు. ఈయన కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయనకు కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు సుబ్బారావు మాజీ మంత్రి సంగిత అల్లుడు, టీడీపీ సీనియర్ నాయకుడు. పుల్లయ్య మృతి పట్ల కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.


చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో గురువారం ఇరిగేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వద్ద నుంచి సేవా కేంద్రాల ద్వారా 24 బస్తాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అలా కాకుండా పండించిన ధాన్యాన్ని అంతా రైతుల వద్ద నుంచి ఆంక్షలు పెట్టకుండా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ బదులిస్తూ రైతులు పండించిన ధాన్యం అంతటినీ కొనుగోలు చేస్తామని చెప్పారు. దీనిపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ చెప్పారని గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల మండపేటలో స్థానిక విలేకరులకు చెప్పారు. రైతులంతా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించు కోవాలని ఎమ్మెల్యే సూచించారు. రెండవ పంటకు సాగునీటి ఎద్దడి రాకుండా కపిలేశ్వ పురం మండలంలో వున్న తాతపూడి పంపింగ్ స్కీంకు మరమ్మతులు చేసి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ధాన్యం కొనుగోలు మద్దతు ధరల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లు

మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలి

ద్రాక్షారామ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం విక్రయాలు జరగాలని ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ అన్నారు. గురువారం రామచంద్రపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగింది. ఈ సమావేశంలో పలు పుంతరోడ్ల నిర్మాణం తదితర రైతు సమస్యలపై చర్చించారు. అనంతరం ఖరీఫ్ ధాన్యం ప్రభుత్వ మద్దతు ధరల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, డైరెక్టర్లు గుణ్ణం వినోద్‌కుమార్, నారపురెడ్డి బలరామ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.వాసుదేవరావు, ఏడీ నాగకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన కార్తీకమాస నగర సంకీర్తన



వెదురుపాక శివాలయం వద్ద సంకీర్తనలు చేస్తున్న భక్తులు

రాయవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని వెదురుపాక గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన కార్తీకమాస నగర సంకీర్తన గురువారంతో ముగిసింది. కార్తీక మాసం నెల రోజుల భక్తులు గ్రామంలో శివనామ స్మరణతో పాటు హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ గ్రామంలో సంకీర్తనలు చేశారు. అనంతరం గ్రామంలో పార్వతి సమేత సోమేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి, రెడ్ల రామాలయం, పోలేరమ్మ అమ్మవారి ఆలయాలతో పాటు గ్రామంలోని అన్ని ఆలయాల్లో సంకీర్తనలు ఆలపించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గురువారం శివాలయంలో పూజలు, హారతులు జరిపారు. గ్రామంలో ప్రతిరోజు తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 6 వరకు సుమారు 60 మంది భక్తులు నగర సంకీర్తనలో పాల్గొన్నారని తెలిపారు. కార్తీక మాసం ముగిసిన సందర్భంగా నగర సంకీర్తన ముగిసినట్టు రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గొలుగూరి గోవిందరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, చిట్టూరి వెంకటరమణ, అధిక సంఖ్యలో గీతా మందిరం సత్సంగ సభ్యులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మండపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 28, 29 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే పీడీఎస్‌యు రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పీడీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి బి.సిద్దు గురువారం మండపేటలో ఆవిష్కరించారు. ఆలమూరు రోడ్డులో వున్న ఐటిఐ వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరణ అనంతరం సిద్దు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు కె.మణిదీప్, మనోజ్, కేవీ హరి, ఎం.సతీష్, నగేష్, పి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారాన్ని నమ్మవద్దు

కొత్తపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే వైసీపీ నేతలు అవాస్తవాలతో ప్రచారం చేస్తున్నారని ప్రజలు నమ్మవద్దంటూ టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి కోరారు. గురువారం కొత్తపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంటే వైసీపీ విష ప్రచారానికి తెరలేపిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

మండపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేశవరం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పలువురు గ్రామానికి చెందిన కె.శ్రీనివాస్ సారథ్యంలో గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో పి.రాంబాబు, ప్రకాశం, జయమ్మ, పోలమ్మ, సరోజని, లక్ష్మీ, ముత్యాలు, శేఖర్ తదితరులు పార్టీలో చేరిన వారిలో వున్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, యు.సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, యు.తాతాజీ, ఎంపీపీ వాసు, పోతురాజుస్వామి దేవస్థానం చైర్మన్ ఆళ్ల రాజు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మండపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండపేటలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి గురువారం పరిశీలించారు. మండపేటలో చేపట్టిన ఆయా పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట మున్సిపల్ డీఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పేరవరంలో అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ

ఆత్రేయపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరంలో గురువారం అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు చదవడం మాకిష్టం కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. పిల్లలు బడికి వెళ్లాలి...పెద్దలు పనికి వెళ్లాలి అనే నినాదంతో విద్యార్థులు అక్షరాస్యత దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాలను శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.



మెర్లపాలెం అగ్నిప్రమాద బాధితులకు సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ఆత్రేయపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఆయా కుటుంబాలకు చెందిన ములగలేటి వెంకన్న, కొమ్మర సుబ్బలక్ష్మి కుటుంబాలకు రావులపాలెం అక్షయ సేవా సంస్థ రూ.55వేలు విలువైన సామగ్రిని బాధిత కుటుంబాలకు వారు అందజేశారు. వారి చేయూతను స్థానికులు పలువురు అభినందించారు.